క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పాపిరెడ్డినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ ఉమారాణి తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, దూబే కాలనీ, ఆదర్శనగర్ రోడ్డు నెంబర్ 1,2,3, లింగంపల్లి రైల్వే స్టేషన్ ఎదురు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయాన్ని గమనించాలని కోరారు.

పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మార్కెట్, ప్రేమ్‌నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల, హఫీజ్‌పేట్, ప్రేమ్‌నగర్ పూర్తిగా, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

గచ్చిబౌలిలో ..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నానక్‌రాంగూడ, సుమధుర అపార్ట్‌మెంట్స్, ది శ్రీరామ స్కూల్, గోల్ఫ్‌వ్యూ అపార్ట్‌మెంట్స్, బౌల్డర్ హిల్స్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని ఏఈ వేణుగోపాల్ తెలిపారు.

- నానక్‌రాంగూడ ఎస్ వీడియా విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వజ్రం అపార్ట్‌మెంట్స్, వైజయంతి అపార్ట్‌మెంట్స్, ఎస్‌వీడియా, నానక్‌రాంగూడ, ప్రైమ్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

శాంతిసరోవర్‌లో మహా శివరాత్రి వేడుకలు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి శాంతిసరోవర్ ప్రాంగణంలో మహాశివరాత్రి వేడుకలను ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది 16 ఫీట్ల గోల్డ్ కలర్ శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శనం.. స్పిరిచ్యువల్ ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, లెటర్ టు గాడ్ కార్యక్రమం, చర్చలు, మెడిటేషన్, వాల్యూ గేమ్స్, హెల్త్ స్టాల్ నిర్వహిస్తున్నారు.

సరికొత్తగా..



మయూరీనగర్‌లో మల్టీ జనరేషన్ పార్కు

- చందానగర్ సర్కిల్‌లో ఐదు థీమ్ పార్కులు
- రూ.2 కోట్ల నిధులతో పార్కు అభివృద్ధికి శ్రీకారం

మియాపూర్: సాధారణ పార్కులకు భిన్నంగా.. అభ్యాసానికి తోడ్పాటునందించేలా.. అందరినీ ఆకట్టుకునేలా మల్టీ జనరేషన్ (థీమ్) పార్కులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు చందానగర్ జీహెచ్ఎంసీ అధికారులు. కొద్దిసేపు సమయం దొరికితే ప్రజలు మాల్స్‌కు పరుగులు పెడుతున్నారు. ఈ క్రమంలో సరికొత్త తరహా మల్టీ జనరేషన్ పార్కు రూపుదిద్దుకుంటోంది. మిగతా పనులను కూడా అధికారులు వేగవంతం చేశారు. అతిత్వరలో మియాపూర్‌వాసులకు ఆహ్లాదకరమైన పార్కు అందుబాటులోకి రానుంది.

- మల్టీ జనరేషన్ పార్కు అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2019లో పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- 8 ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేస్తున్నారు. రంగు రంగుల చిత్రాలు, యోగాసనాలు తెలిపే విధంగా బొమ్మలను చిత్రీకరించారు.
- పార్కు ముఖద్వారాన్ని అందంగా తీర్చిదిద్దారు. చిన్న పిల్లలతో పాటు సీనియర్ సిటిజన్స్ మెమొరీ పవర్ పెంచుకునేలా మెమరీ గార్డెన్ ఏర్పాటు చేశారు.
- ఈ పార్కులో పెరగలేను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్స్ సిద్ధమయ్యాయి.
- పార్కు చుట్టు ప్రహరీపై రంగురంగుల చిత్రాలను వేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.
- పార్కులో యోగా చేసేందుకు వేదికను ఏర్పాటు చేయనున్నారు.
- ఓపెన్ జిమ్, పిల్లలకు ఆట వస్తువులు, ఆహ్లాదానికి ఫినిక్స్ స్థలం ఏర్పాటు చేస్తున్నారు.
- షూటర్ వాల్, లైబ్రరీ, ఆంఫి థియేటర్, కమ్యూనిటీహాల్ ఉన్నాయి
- 2 సంవత్సరాల నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలకు వేర్వేరుగా ఆట స్థలాలు కేటాయించారు.



మయూరీనగర్‌లోని మల్టీ జనరేషన్ పార్కు ముఖ ద్వారం

- రాక్ గార్డెన్, ఆరెంజ్ బాల్స్, వాటర్ ఫౌంటెన్, ఆకర్షణీయమైన అద్దాలు, చిట్టడవి నిర్మాణం, పచ్చిక బయలు పనులు జరుగుతున్నాయి.



అపర్ణ గ్రాండేలో రన్ డే

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో ఆదివారం రన్ డేను నిర్వహించారు. గ్రాండే రన్ డే పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమ్యూనిటీలోని యువకులు, చిన్నారులు, మహిళలు, సీనియర్ సిటిజన్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 3, 5, 10 కిలోమీటర్ల రన్నింగ్, వాకింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో మెడల్స్‌ను అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 1500 మంది పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, శంకర్, బాబిరెడ్డి, హరికుమార్, శాలిని, రాధారెడ్డి, అంబిలి, గౌరి, చేతనా భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్ లీగ్ ఫైనల్లో టీమ్ మైసా, స్వాన్స్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ మూడో సీజన్ తుది అంకానికి చేరింది. 16 జట్లతో ఉత్సాహంగా సాగుతున్న ఈ లీగ్‌లో టీమ్ మైసా, టీమ్ స్వాన్స్ టైటిల్ పోరుకు సిద్ధమయ్యాయి. ఆదివారం జరిగిన సెమీఫైనల్స్‌లో ఈ రెండు జట్లూ తమ ప్రత్యర్థులపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఊటీ గోల్ఫ్ కౌంటీ వేదికగా జరిగిన తొలి సెమీస్‌లో టీమ్ మైసా 50-30 స్కోర్‌తో మీనాక్షి మావెరిక్స్‌పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో టీమ్ స్వాన్స్ 45-35 స్కోర్‌తో టీమ్ ఆల్ఫాపై గెలుపొందింది. థాయ్‌లాండ్‌లో ఫిబ్రవరి 24న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. లీగ్ ఆరంభం నుంచీ ప్రతీ మ్యాచ్ ఆసక్తికరంగా సాగడంపై హెచ్‌పీజీఎల్ కమిషనర్ డీఎస్ సుమంత్ ఆనందం వ్యక్తం చేశారు.

హుక్కా పార్లర్‌పై దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కిమ్టి ఎన్‌క్లేవ్‌లో లావిష్ ఎలిసూయన్ పేరుతో ఏర్పాటైన హుక్కా పార్లర్‌పై బంజారాహిల్స్ పోలీసులు దాడి చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేయడమే కాకుండా పెద్ద ఎత్తున హుక్కా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కిమ్టి ఎన్‌క్లేవ్ బిల్డింగ్ ఐదవ అంతస్తులో గుట్టుచప్పుడు కాకుండా కొంత కాలంగా డబిల్‌పురకు చెందిన షేక్ మహ్మద్ సాహిబ్, అబ్రార్ అహ్మద్ ఖాన్ హుక్కా సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన పోలీసులు. పెద్ద ఎత్తున హుక్కా సామాగ్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి

- బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్

పటాన్‌చెరు టౌన్: ఫిబ్రవరి14 న కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో విజయ్ మాట్లాడుతూ... అసంఘటిత రంగ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు.

బీసీలకు పెద్దపీట

పటాన్ చెరు టౌన్: ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేసి ప్రాధాన్యం కల్పిస్తున్నారని,దీనికి నిదర్శనమే ఎమ్మెల్సీ బండా ప్రకాష్‌కు శాసనమండలి వైస్ చైర్మన్‌గా అవకాశం కల్పించడమే అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం బండ ప్రకాష్ ను కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐటీ, మున్సిపల్ శాఖమంత్రి కేటీఆర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కవితలను మర్యాద పూర్వకంగా కలిశారు.

డాక్ ఫ్రాస్ట్ ఐస్‌క్రీం స్టోర్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని దుర్గంచెరువు మెట్రో రైల్‌స్టేషన్ వద్ద ఆదివారం డాక్ ఫ్రాస్ట్ పేరిట ఐస్‌క్రీం స్టోర్‌ను సాంస్కృతిక, పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మంచి ప్రోటీన్‌లు కలిగిన ఐస్‌క్రీంలను అందించాలని కోరారు. కార్యక్రమంలో మూల సుభాష్ గౌడ్, శశాంక్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ముగిసిన ఫుడ్, క్రాఫ్ట్ ఫెస్టివల్





మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఒడిశా ఫుడ్, క్రాఫ్ట్ ఫెస్టివల్ ఆదివారం ముగిసింది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఒడిస్సీ, సంబల్పూరి జానపదం, గిరిజన నృత్యాలు సందర్శకులను అలరించాయి. - మాదాపూర్



నిత్యం ట్రాఫిక్ సమస్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రాత్రి వేళ గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతకాలంగా రైల్వే అండర్ బ్రిడ్జి వెడల్పు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో కొత్త కొత్త కాలనీలు రావడంతో రద్దీ మరింత పెరిగింది.

ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతే..

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు: రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతవడం ఖాయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమీన్‌పూర్‌లోని ఆర్టీసీ కాలనీలో వివిధ పార్టీల నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు మూడు వందల మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. యువత స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. అనంతరం మండల పరిధిలోని కర్ధనూర్‌లో అక్క మహంకాళి బీరప్ప స్వామి, కామారతి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠకు, పటేల్‌గూడలోని కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ పదవీ బాధ్యతలు స్వీకరించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు తుమ్మల పాండురంగారెడ్డి, కౌన్సిలర్ మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి, పుష్ప నాగేశ్‌యాదవ్, కర్ధనూర్ సర్పంచ్ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ గంగుల సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ దేవానందం తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా అమ్మవారి జాతర

సుభాష్‌నగర్: సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ ప్రధాన జాతర ఆదివారం కనులపండువగా జరిగింది. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలు, శివసత్తుల విన్యాసాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకోవడానికి తరలి వచ్చారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అనంతరం శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..

అమ్మవారిని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తదితరులు దర్శించుకున్నారు.

నిబంధనలు తూచ్..



ప్రేమావతి పేట చెరువు వద్ద నూనె వ్యర్థాల నుంచి రసాయనాలు తయారు చేస్తున్న దృశ్యం



పేలుడు జరిగిన ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ

- తరచూ ప్రమాదాలు
- అనుమతులు లేకుండానే పరిశ్రమల నిర్వహణ
- నేతలు, అధికారులకు కాసులు కురిపిస్తున్న కంపెనీలు

శంషాబాద్: ఇక్కడ నిబంధనలు ఏమాత్రం పాటించరు. అంతకుమించి కనీసం సంబంధిత శాఖల నుంచి అనుమతులు సైతం తీసుకోరు. ఇష్టారాజ్యంగా కొనసాగుతోన్న పరిశ్రమలు కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు పెత్తనం చెలాయిస్తున్న కొందరు నేతలు, ప్రజాప్రతినిధులకు కాసులు కురిపిస్తున్నాయి. ఫలితంగా పర్యావరణ హానితో పాటు ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి..

లెక్కకు మించి పరిశ్రమలు

గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోన్న పరిశ్రమల్లో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా అనేక మంది కార్మికులు గాయాలపాలయ్యారు. నూనె పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ప్లై వుడ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గత పదేళ్లలో సుమారు యాభైకి పైగా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతి చెందిన కార్మికులతో పాటు అనేక మంది గాయాలపాలయ్యారు. ఇందులో అత్యధికం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పరిశ్రమల్లో జరిగినవే కావడం గమనార్హం.

ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు..

గగన్‌పహాడ్‌లో ప్లాస్టిక్‌కు సంబంధించిన వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే పరిశ్రమలతో పాటు రసాయన వ్యర్థాలు శుద్ధితో పాటు జంతు వ్యర్థాలతో తయారు చేసే నూనెలు, నూనెల వ్యర్థాలతో తయారు చేసే రసాయనాలకు సంబంధించిన పరిశ్రమలు అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. ప్రేమావతి పేట చెరువు సమీపంలో ఓ వ్యక్తి భారీగా నూనె వ్యర్థాలతో రసాయనాలను తయారుచేసి లారీల్లో సరఫరా చేయడంతో పాటు వ్యర్థాలన్నింటినీ చెరువులో కలుపుతున్నాడు. దీనిపై అనేక ఫిర్యాదులొచ్చినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నిబంధలనకు విరుద్ధంగా జంతు సంబంధిత నూనె తయారీ పరిశ్రమ కొనసాగుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సంబంధిత పరిశ్రమల నుంచి ఆయా శాఖలకు చెందిన కొందరు అధికారులతో పాటు కొందరు పోలీసులు, స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులకు కూడా భారీగానే ముడుపులు అందుతుండడంతో చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగే సమయంలో హడావిడి చేస్తున్న ఆయా శాఖల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకుని పర్యావరణంతో పాటు ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి రోజు పేలుళ్లు



ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలో ప్రతిరోజు బాటిళ్లు పేలి వాటి ముక్కలు బయటపడుతుంటాయి. పలుమార్లు వాహనాలపై పడ్డ సంఘటనలున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఎండీ రెహ్మాన్, గగన్‌పహాడ్

నకిలీ ఆయుర్వేదిక్ డాక్టర్ అరెస్టు

పంజగుట్ట: సులువుగా డబ్బు సంపాదించేందుకు ఆయుర్వేదిక్ డాక్టర్ అవతారమెత్తి ప్రజల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని క్లినిక్‌ను సీజ్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రం, బెల్గాంకు చెందిన బాలకోట్ విజయస్వామి నగరానికి వలస వచ్చి లంగర్‌హౌస్‌లో నివాసముంటున్నాడు. త్వరగా డబ్బు సంపాదించాలనే తపనతో ఆయుర్వేదిక్ డాక్టర్ అవతారమెత్తిన అతను ఎలాంటి లైసెన్స్, డిగ్రీ లేకుండానే అమీర్‌పేటలోని మెరిడియన్ ప్లాజా రెండో అంతస్తులో తులసి ఆయుర్వేదిక్ క్లినిక్ ప్రారంభించాడు. కేన్సర్, పక్షవాతం, కిడ్నీ, వినికిడి సమస్య, ఆస్తమా తదితరాలను నయం చేస్తామని పబ్లిసిటీ చేసుకున్నాడు. సమస్యతో వచ్చిన వారికి ఏవో మూలికలు, ఔషధాలు ఇస్తూ రూ. వేలల్లో డబ్బులు వసూలు చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పంజగుట్ట ఎస్సై గిరిధర్ శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాలకోట్ విజయ్‌స్వామితో పాటు అందులో విధులు నిర్వహిస్తున్న తల్వార్ పరశురామ్ అర్జున్, మాస్టర్ భీమాలను అదుపులోకి తీసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఔషధాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్ పర్యటన



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని కేటీఆర్ కాలనీ, సిక్కుల బస్తీ పరిసర ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు చేరి పిచ్చిమొక్కలు పెరిగిపోయి దోమలకు ఆవాసంగా మారింది. ఈ సమస్యను స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, షౌకత్‌అలీ మున్నా, మోజెస్, వాసుదేవరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో విరించి చౌరస్తా

- ఫ్లై ఓవర్ నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం
- పాదచారుల వంతెన అవసరమంటున్న స్థానికులు
- పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు



విరించి ఆస్పత్రి చౌరస్తాలో స్తంభించిన ట్రాఫిక్

బంజారాహిల్స్: అవసరమైన చోట్ల ఫ్లై ఓవర్లు నిర్మించరు... పాదచారులు రోడ్డు దాటేందుకు వంతెనలు ఉండవు.. ఇష్టానుసారంగా కూడళ్లలో రాకపోకలు.... ఫలితంగా వాహనదారులు నిత్యం నరకాన్ని చూస్తున్నారు. గంటల తరబడి కూడళ్లలో సిగ్నళ్ల వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు రాకపోకలు సాగించే బంజారాహిల్స్ రోడ్ నెం. 1/12 విరించి ఆస్పత్రి చౌరస్తాలో గడిచిన నాలుగు దశాబ్దాలుగా ట్రాఫిక్ ఇక్కట్ల నుంచి స్థానికులకు విముక్తి లభించడం లేదు. అదే రోడ్డు.. అదే చౌరస్తా... ఏ మాత్రం విస్తరణకు నోచుకోని ఈ కూడలిలో వాహనదారులే కాదు రోడ్డు దాటేందుకు పాదచారులు అవస్థలు పడుతున్నారు. మాసబ్ ట్యాంకు వైపు నుంచి పోలీస్ మెస్ చౌరస్తా, 1/12 విరించి ఆస్పత్రి చౌరస్తా దాటి బంజారాహిల్స్ రోడ్ నెం. 12 వైపు, కేర్ ఆస్పత్రి వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ ఇరుకైన రోడ్డుతో పాటు అడుగడుగునా పాదచారులు రోడ్డుదాటుతుండటంతో వాహనాల రాకపోకలు ముందుకు సాగడం లేదు. కేర్ ఆస్పత్రి వైపు నుంచి మాసబ్‌ట్యాంక్, బంజారాహిల్స్ రోడ్ నెం. 12, రోడ్ నెం. 13 వైపు వెళ్లే వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే గడపాల్సి వస్తుంది. వాహనాలు కేర్ ఆస్పత్రి నుంచి మొదలుకొని 1/12 చౌరస్తా వరకు స్తంభించిపోయి మాసబ్‌ట్యాంకు వైపు వెళ్లడమే గగనంగా మారుతోంది.

పరిష్కారమిదీ...

బంజారాహిల్స్ రోడ్ నెం. 1/12 విరించి చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే అందుకు జీహెచ్ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదు. ఈ చౌరస్తాలో తప్పనిసరిగా ఫ్లై ఓవర్ నిర్మాణంతో పాటు పాదచారుల వంతెన కూడా అవసరం.

పింఛన్ ఆఫీస్ వైపు నుంచి దారి మూసివేత...

మాసబ్‌ట్యాంకు వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం. 12 వైపు వెళ్లే మలుపు వద్ద శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఉండగా ఈ ఆలయం వెనుక నుంచి పింఛన్ ఆఫీస్ గేటు లోపల గతంలో ఓ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డు అందుబాటులోకి వస్తుందనుకునేలోగా కొందరు అడ్డుపడటంతో ఈ దారిని బండరాళ్లు వేసి మూసివేశారు. గత పదేళ్లుగా ఈ సమస్యను పట్టించుకునే వారే లేరు. గుడి వెనుక దారి ఏర్పాటు చేస్తే మాసబ్ ట్యాంక్ వైపు నుంచి బంజారాహిల్స్ రోడ్ నెం. 12 వైపు వెళ్లేవారు తేలికగా ఫ్రీ లెఫ్ట్‌లో ముందుకు సాగుతారు. దీని వల్ల చాలా వరకు ఈ కూడలిపై ట్రాఫిక్ భారం తగ్గుతుంది.

ప్రణాళికలేవీ..?

మాసబ్ ట్యాంకు వైపు నుంచి పోలీస్ మెస్ చౌరస్తా, 1/12 చౌరస్తాల మీదుగా కేర్ ఆస్పత్రి దాకా ఓ ఫ్లై ఓవర్ నిర్మించాలనే ప్రతిపాదనలు అమలుకు నోచుకోవడం లేదు. ఇక్కడ రోడ్డు విస్తరణ కూడా చేపట్టాల్సిన అవసరం ఉంది. ఫుట్‌పాత్‌లు కూడా అందుబాటులో లేవు. గజిబిజి ట్రాఫిక్ మధ్య అక్రమ పార్కింగ్‌లు పెద్ద సమస్యగా మారాయి. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన అవసరం ఉంది.